
VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
బుధవారం 17 ఏప్రిల్ 2024
సంపుటి.01 సంచిక.265



- శంకర్‌రావు(ఫైల్), ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో ఎన్‌కౌంటర్ సందర్భంగా భద్రతా దళాల కదలికలు
- ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 29 మంది మావోయిస్టుల మృతి
- ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం..
- బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్, ఎస్పీ కళ్యాణ్ ఎలిసెల్లి వెల్లడి
- బస్తర్ అడవుల్లోని కాంకేరు జిల్లా ఛోట్ బెటియా ప్రాంతంలో ఘటన
- మావోస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో కూంబింగ్
- చేపట్టిన భద్రతా దళాలు.. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు
- కొనసాగిన ఎదురుకాల్పులు
- మృతుల్లో ఏపీకి చెందిన అగ్రనేత సుగులూరి చిన్నన్న అలియాస్ శంకర్‌రావు..
- ఈయన తలపై రూ. 25 లక్షల రివార్డు
- ఇద్దరు తెలంగాణ వాసులు కూడా గుర్తింపు
- రాష్ట్రానికి చెందిన మరికొందరు కూడా మరణించి ఉంటారనే అనుమానాలు..
- ముగ్గురు భద్రతా సిబ్బందికి గాయాలు
- ఘటనా స్థలంలో ఏడు ఏకే 47లు, మూడు ఎల్ఎంజీలు, ఇతర ఆయుధాలు స్వాధీనం



# 29 మంది మావోయిస్టుల మృతి
## నెత్తురోడిన బస్తర్..

**వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో రక్తం ఏరులై పారింది. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న భీకర ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మరణించారు. భద్రతా దళాలకు చెందిన ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. మృతుల్లో ఇప్పటివరకు ముగ్గురిని గుర్తించగా.. వారిలో ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మరికొందరు తెలంగాణ వాసులు కూడా మృతి చెంది ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.బీఎస్ఎఫ్, డీఆర్‌జీ బలగాలు.. మావోయిస్టులకు మధ్య మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్, ఎస్పీ కళ్యాణ్ ఎలిసెల్లి మంగళవారం రాత్రి వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమి టీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు.ఏపీలోని కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వద్ద రామపురం గ్రామానికి చెందిన ఈయ నపై రూ.25 లక్షల రివార్డు ఉంది. మరోవైపు దండకారణ్యం స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాంధర్ అలియాస్ మజ్జిదేవ్ కూడా మరణించినట్లు తెలుస్తోంది. గత పదిహేనేళ్లలో బస్తర్ అడ వుల్లో ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్‌గా పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మావోయిస్టుల సమావేశంపై సమాచారంతో.. బస్తర్ అటవీ ప్రాంతంలో మొత్తం ఏడు జిల్లాలు ఉండగా కాంకేరు జిల్లా ఛోట్ బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలోని బినాగుండ, కరోనార్ మధ్య హపటోలా, (ఛోట్ బెటియా పోలీస్ స్టేషన్‌కు తూర్పున 15 కి.మీ దూరంలో) మాడ్ సమీప అటవీ ప్రాంతంలో ఈ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాడ్ ప్రాంతంలో మావోయిస్టు నేతలు సమావేశం అయ్యారన్న పక్కా సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి.

ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల సమయాన ఇరువర్గాల మధ్య హోరాహోరీగా ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఎన్‌కౌంటర్ రాత్రి వరకు కొనసాగగా..ఎదురుకాల్పుల తర్వాత మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



2లో

## పతంజలిపై మరోమారు
# సుప్రీం ఆగ్రహం
మీరేమీ అంత అమాయకులు కారు



2లో

## మెగా డిఎస్సీ అంటూ
# దగా డిఎస్సీ చేపట్టారు

- చలిచీమల వలె కాంగ్రెస్‌ను చంపండి
- ఇచ్చిన హామీలపై అధికార పార్టీని నిలదీయండి
- కొందరు అధికారం పోగానే పార్టీ వీడారు
- గట్టిగా కలబడితే ఆదిలాబాద్‌లో విజయం మనదే
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



## శ్రీరామనవమి సర్వ శ్రేయస్కరం
## ఊరూరా ఏటా
# కల్యాణోత్సవాలు

**భద్రాచలం:** శ్రీరామనవమి పండుగ రోజే సీతారామ కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భద్రాచలంలో ప్రత్యేకంగా కళ్యాణం జరగడం ఆనవాయితీగా వస్తోంది. కడప జిల్లా ఒంటిమిట్ట, రామతీర్థంలో కూడా కళ్యాణాలు జరుగబోతున్నాయి. శ్రీరామనవమి తొమ్మిది రోజుల పండుగగా కొందరు జరుపుకొంటారు. కొంతమంది పాడ్యమి నుంచి శ్రీరామనవమి వరకూ మరికొంతమంది శ్రీరామనవమి నుంచి వరుసగా తొమ్మిది రోజులు జరపటం కూడా కనిపిస్తుంది. నవమి ఉత్సవాల సందర్భంగా పెద్ద పెద్ద పందిళ్లు వేసి సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రబద్ధంగా జరిపించి ఎంతో వైభవంగా అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను పట్టణాలు, నగరాలలో, పల్లెల్లో కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విధితో నిర్వహించుకోడానికి ముందుగా సీతారామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల విగ్రహాలను కానీ పటాన్ని కానీ పెట్టి పూజ చేయాలి. కొంతమంది హనుమత్ సమేతుడుగా సీతామాతతో ఉన్న శ్రీరామచంద్రమూర్తిని పూజిస్తుంటారు. పూజా ప్రదేశంలో పసుపు రాసిన పీట వేసి దాని మీద ముగ్గుదిద్ది, కుంకుమతో అలంకరించి ఆ పీట మధ్య భాగంలో చందనంతో అష్టదళ పద్మాన్ని వేయాలి.

# రైతులను నమ్ముకున్న కెసిఆర్

- వారిని పరామర్శిస్తూ ఎన్నికల ప్రచారం
- బస్సుయాత్రకు శ్రీకారం చుట్టే యత్నం
- 18న బిఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం
- కెసిఆర్ షెడ్యూల్ ఖరారు చేయనున్న పార్టీ

2లో



# గల్ఫ్ కార్మికులకు జీవిత బీమా..

- ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ప్రత్యేక వ్యవస్థ
- ఏజెంట్ల మోసాల కట్టడికి చర్యలు
- కార్మికులు మరణిస్తే.. రూ.5 లక్షల బీమా
- సెప్టెంబరు 17లోగా సమస్యలన్నింటికీ పరిష్కారం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ

గల్ఫ్ కార్మికులకు బోర్డుగల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నామని, దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.





‘గల్ఫ్‌లోని జైళ్లలో మగ్గుతున్న కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం న్యాయవాదులను ఏర్పాటు చేసి విడిపించేందుకు కృషిచేయాలి.

3లో

వేగుచుక్క
బుధవారం 17 ఏప్రిల్ 2024

# మెగా డిఎస్సీ అంటూ దగా డిఎస్సీ చేపట్టారు

**ఆదిలాబాద్:** చలిచీమలు కలిసి బలమైన సర్పాన్ని ఎలా చంపుతాయో.. అదే పద్ధతుల్లో ఈ కాంగ్రెస్ అనే విషసర్పాన్ని గులాబీ జెండా కప్పుకున్న చలి చీమలే చావుదెబ్బ కొడుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొంత మంది నాయకులు బీఆర్ఎస్‌ను వీడారని కేటీఆర్ పేర్కొన్నారు. ముథోల్, నిర్మల్, కాగజ్‌నగర్‌లో పెద్ద నాయకులు పోయారు. అధికారం రాగానే మా వద్దకు వచ్చారు. అధికారం పోగానే మళ్లీ పోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిగా పోరాడితే.. పక్కాగా గెలుస్తాం. ఆదిలాబాద్‌లో త్రిముఖ పోటీ ఉంటుంది. బీజేపీ, కాంగ్రెస్‌పై ప్రజలు మంట మీద ఉన్నారు. మొన్న ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్దాం. లంబాడా, ఆదివాసీ సోదరులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాం. పోడు భూములకు పట్టాలు ఇచ్చుకున్నాం. సేవాలాల్ జయంతిని అధికారికంగా జరుపుకున్నాం. కుమ్రం భీం జల్ జంగల్ జమీన్ అని అంటే దాన్ని ఆచరణలో కేసీఆర్ చేసి చూపించారు. ఇంటింటికి నీళు ఇచ్చారు. ప్రతి ఎకరాకు సాగు నీరు అందించారు. హరితహారం పేరుతో జంగల్‌ను కాపాడారు. కుమ్రం భీం ఆశయాలను అలా కేసీఆర్ ముందుకు తీసుకుపోయారు. నాటి ప్రభుత్వాలు కుమ్రం భీంను గుర్తించలేదు, పట్టించుకోలేదు. జోడెన్‌ఘాట్‌లో కుమ్రం భీం స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అధికారికంగా జయంతి, వర్ధంతి ఉత్సవాలు నిర్వహించి, నిజమైన నివాళులర్పించాం. కొత్తగా ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు చేసి కుమ్రం భీం పేరు పెట్టి ఆయన ఆశయాలను నెరవేర్చాం అని కేటీఆర్ తెలిపారు. ఆనాడు ఇంద్రవెల్లిలో కాల్పులు జరిపింది కాంగ్రెస్ ప్రభుత్వమే. అదే ఇంద్రవెల్లికి రేవంత్ రెడ్డి వస్తాడు. సిగ్గు లేకుండా, మాటల్లో నిజాయితీ లేకుండా అమరవీరులకు క్షమాపణ చెప్పకుండా గిరిజనులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది. ఇవన్నీ గ్రామాల్లో వివరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు ఉన్న భ్రమలు తొలగిపోయాయి. మే 13న కర్రుకాల్చి వాత పెట్టాలని చూస్తున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అధికారం శాశ్వతం కాదు.. పోయింది అధికారం మాత్రమే.. కార్యకర్తల్లో పోరాట పటిమ తగ్గలేదు. గ్రామాల్లో కార్యకర్తలు గట్టిగా ఉన్నారు. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సొసైటీ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని కేటీఆర్ తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో టెట్ ఫీజు రూ. 400 పెడితే.. ఇంత ఎక్కువ పెడుతారా..? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే టెట్ ఫీజు వసూలు చేయకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. కానీ ఇవాళ టెట్ ఫీజు రూ. 1000 చేశారు. ఇంకా ఎంత పచ్చి మోసం చేసిందంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన 5 వేల డీఎస్సీ ఉద్యోగాలకు మరో 5 వేల ఉద్యోగాలు కలిపి రేవంత్ రెడ్డి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పుడేమో ఇది
దగా డీఎస్సీ.. మెగా డీఎస్సీ కాదు అని రేవంత్ అన్నారు. 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 5 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఎందుకు ఇస్తున్నావని ప్రశ్నించారు. ఇవాళ 5 వేలకు మరో 5 వేలు కలిపి పది వేలకు నోటిఫికేషన్ ఇచ్చారు. మరి ఇది దగా డీఎస్సీ కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ ప్రతి ఒక్కరికి తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. గ్రూప్-1 కింద 500కు ఇంకో 60 కలిపి 560 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుల మాటలేమో ఆకాశంలో.. చేతలేమో పాతాళంలో. తెలంగాణ ప్రజలను పచ్చి మోసం చేస్తున్నారు కాంగ్రెసోళ్లు అని కేటీఆర్ మండిపడ్డారు.



## పతంజలిపై మరోమారు సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** ప్రజలను తప్పుదారి పట్టించే ప్రకటనల కేసులో యోగా గురు రామ్‌దేవ్, పతంజలి డైరెక్టర్ బాలకృష్ణలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రంగా మండిపడింది. కోర్టు వ్యవహారాల గురించి తెలియకపోవడానికి మీరేమీ అమాయకుల కాదని మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. మూడు సార్లు కోర్టు ఆదేశాలను ధిక్కరించారని దుయ్యబట్టింది. మిమ్మల్ని క్షమించాలా వద్దా అని ఇంకా నిర్ణయించుకోలేదని జస్టిస్ హిమా కొహ్లీ, జస్టిస్ ఎ. అమానుల్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. 'యోగా'కు మీరు అందించిన సహకారం మరువలేనిదని, అయితే వారి వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయుర్వేద ప్రయోజనాలను గురించి వివరించేందుకు ఇతర వైద్య వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. చట్టం అందరికీ ఒకటేనని జస్టిస్ అమానుల్లా పేర్కొన్నారు. వారంరోజుల్లోగా క్షమాపణలు తెలుపుతూ బహిరంగ ప్రకటన విడుదల చేయాలని కోర్టు హెచ్చరించింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 23కి వాయిదావేసింది. బహిరంగ క్షమాపణలు చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని యోగా గురు రామ్‌దేవ్, పతంజలి డైరెక్టర్ బాలకృష్ణలు సుప్రీంకోర్టుకు తెలిపారు. పంతజలి సహ వ్యవస్థాపకుడు రామ్‌దేవ్, ఆ సంస్థ సిఇఒ బాలకృష్ణ క్షమాపణలను తిరస్కరిస్తూ.. గత వారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కోర్టు చర్యలకు సిద్ధం కావాలని ఆదేశించింది. క్షమాపణ కాగితంపై మాత్రమే ఉందని, కానీ వారి యథావిధిగా వ్యవహరిస్తున్నారని మండిపడింది. కోర్టు చర్యల నుండి తప్పించుకునేందుకు కేవలం ఆత్మరక్షణ కోసమే క్షమాపణలు చెప్పారని మండిపడింది. 'క్యూర్ ఫర్ కొవిడ్' ప్రకటనలపై చర్యలు తీసుకోని ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి చీవాట్లు పెట్టింది.

## తెలంగాణలో అనూహ్య ఫలితాలు


**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రచారపర్వం ఊపందుకుంది. పార్టీలకు అతీతంగా సీట్లు ఖరారైన అభ్యర్థులంతా ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీల తరఫున ప్రధాన నేతలు కూడా విస్తృతంగా పర్యటించి ప్రచారం చేస్తున్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి, తదితరులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా తెలంగాణ బరిలో ప్రధాన పోటీదారులుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తు న్నాయి. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా ఎక్కువ స్థానాలు గెలుచేది తామంటే తామంటూ ఏ పార్టీకి ఆ పార్టీ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్ ఆసక్తికరమైన ఫలితాలను మంగళవారం వెలువరించింది. తెలంగాణలో 17 సీట్లకు గాను కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 8 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొంది. ఇక బీజేపీ 6 స్థానాలను కైవశం చేసుకోనుందని అంచనా వేసింది. ఇక మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ కేవలం 2 సీట్లకే పరిమితం అయ్యే అవకాశాలున్నాయని విశ్లేషించింది. హైదరాబాద్ ఎంపీ స్థానంలో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా ఖరారైన మాధవిలత చేతిలో ఒవైసీ ఓడిపోయే అవకాశాలు లేకపోలేదని ఇండియా టీవీ - సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్ విశ్లేషించింది. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒకే దశలో మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెలువడ నున్నాయి. ఇక మొత్తం ఏడు దశల్లో జరగనున్న లోక్‌సభ పోల్స్-2024 ఏప్రిల్ 19న తొలి దశతో షురూ కానున్నాయి. మొత్తం 44 రోజుల పాటు కొనసాగనున్న ఎన్నికల పక్రియలో 10.5 లక్షల పోలింగ్ బూత్‌లలో 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. ఇందులో 49.7 కోట్ల మంది పురుషులు, 47.1 కోట్ల మంది స్త్రీలు ఉన్నారని ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించిన విషయం తెలిసిందే. కాగా ఏప్రిల్ 19న మొదటి దశ, ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1న తదుపరి దశలు వరుసగా జరగనున్నాయి.

## రైతులను నమ్ముకున్న కెసిఆర్

**హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు మరింత చేరువ అయ్యేలా ప్రచారం చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. రాష్ట్ర రైతాంగం వద్దకు వెళ్లి నేరుగా వారి కష్టసుఖాలను తెలుసుకోవడానికి, వారికి భరోసానివ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. భారత రాష్ట్రసమితి అభ్యర్థులకు ఎన్నికల ఖర్చులకు కూడా డబ్బులివ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ నెల 18వ తేదీన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కీలక
సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరగనుంది. 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయబోతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు కేసీఆర్ బీ ఫారాలు అందజేయనున్నారు. ఎన్నికల ఖర్చు కోసం ఒక్కో అభ్యర్థికి రూ. 95 లక్షల చెక్‌లు ఇవ్వనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇదే తరహాలో ఎన్నికల ఖర్చును సమకూర్చారు. అనంతరం పార్టీ నేతలతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 18వ తేదీ గురువారం జరగనున్న ఈ సమావేశంలో అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్ పై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం ఏపీ సీఎం జగన్ కూడా బస్సు యాత్ర ద్వారా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ లోక్‌సభ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి కీలకంగా మారాయి. మెరుగైన ఓట్లు, సీట్లు సాధించకపోతే బీఆర్ఎస్ స్థానాన్ని ఆక్రమించుకోవడానికి బీజేపీ రెడీగా ఉంది. బీఆర్ఎస్ పార్టీకి ఒకటి, రెండు సీట్లు కూడా రావని బీజేపీ, కాంగ్రెస్ నేతలు సవాళ్లు చేస్తున్నారు. పార్టీ నేతలు కూడా నమ్మకం కోల్పోయి వరుసగా గుడ్ బై చెబుతున్నారు. ఇలాంటి సమయం లో పార్టీ మెరుగైన ఫలితాలు సాధించే విధంగా కేసీఆర్ సర్వశక్తులు ఒడ్డాల్సి ఉంది. ఇప్పటికే పార్టీని అనేక రకాల సమస్యలు చుట్టుముట్టాయి. కేసీఆర్ తుంటి గాయం కారణంగా ప్రచారం నిర్వహించడం కూడా సమస్యగా మారింది. అయినా బస్సు యాత్ర చేయాలని కేసీఆర్ ఓ నిర్ణయానికి వచ్చారు.మరోవైపు పార్టీ నేతలంతా తమ శక్తివంచన లేకుండా బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. హరీష్ రావు, కేటీఆర్ తో పాటు సీనియర్ నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ సీట్లలో భారీ మెజార్టీ వచ్చిందని.. ఆయా స్థానాలతో పాటు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ వంటి స్థానాలను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇకపోతే కేసీఆర్ కీలక అంశాలపై స్పందించడం లేదు. కాళేశ్వరం కుంగిపోవడం.. ఫోన్ ట్యాపింగ్ అంశాలపై తాను టీవీల్లో కూర్చుని ప్రజలకు అన్నీ చెబుతానన్నారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. కవిత అరెస్టుపైనా ఆయన స్పందించలేదు. వీటన్నింటిపై బస్సు యాత్రలో మాట్లాడతారన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత కాళేశ్వరం, అప్పులు, అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేపట్టింది. అయితే దీనిని కప్పిపుచ్చుకేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు చింతిస్తున్నారని అంటూ కెటిఆర్, హరీష్ రావు తదితరులు ప్రచారం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయిందనేది ప్రజల్లో ఉందని విమర్శలు చేస్తున్నారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ క్రమంలో కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న పరిస్థితి నెలకొందని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. ఈ క్రమంలో పార్టీ ప్రతిష్టను కాపాడుకోవాలంటే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక ఎంపి సీట్లు గగెలవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా అధినేత కేసీఆర్ ప్రచార సరళిని రూపొందించనున్నారు. ఇప్పటికే జరిపిన బహిరంగ సభలకు విపరీతమైన ప్రజా స్పందన వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. తెలంగాణ ప్రజలకు మరింత చేరుకావాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. కాంగ్రెస్ తెచ్చిన కరువుకు అల్లాడుతున్న రాష్ట్ర రైతాంగం వద్దకు వెళ్లి వారి కష్ట సుఖాలను తెలుసుకోవ డానికి, వారికి భరోసానివ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఏప్రిల్ 18వ తేదీ గురువారం జరగనున్న ఈ సమావేశంలో అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్ పై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు.

## సివిల్స్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్:** యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ తుది ఫలితాల్లో మహబూబ్‌నగర్‌కు చెందిన అనన్య రెడ్డి సత్తా చాటారు. తొలి ప్రయత్నంలోనే తన అసాధారణ ప్రతిభతో మూడో ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు మహబూబ్‌నగర్ గీతం హైస్కూల్‌లో చదివిన అనన్య.. ఇంటర్ విద్యను హైదరాబాద్‌లో అభ్యసించారు. దిల్లీలోని మెరిండా హౌస్ కాలేజీలో డిగ్రీ చదివిన ఆమె ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోకుండానే ఈ ఘనతను సాధించారు. యూపీఎస్సీ సివిల్స్ తుది ఫలితాలు వచ్చేశాయ్.. తెలుగు అమ్మాయికి మూడో ర్యాంకు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. 'సివిల్స్' పరీక్ష ఎంతో కఠినంతో కూడినది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలలో ఎదురయ్యే కఠిన సవాళ్లను ఎదుర్కొని నిలవడం ఆషామాషీ వ్యవహారం కాదు. అలాంటిది తొలి ప్రయత్నంలోనే కోచింగ్ కూడా తీసుకోకుండా దాదాపు సొంత ప్రిపరేషన్‌తోనే సివిల్స్‌లో జాతీయస్థాయిలో మూడో ర్యాంకుతో భళా అనిపించారు అనన్య రెడ్డి.
ఈ సందర్భంగా అనన్యారెడ్డి మాట్లాడుతూ..అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామం మాది. ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ కాలేజీ మిరాండ హౌస్‌లో జియోగ్రఫీలో డిగ్రీ పూర్తి చేశాను. ఇక డిగ్రీ చదువుతున్న సమయంలోనే సివిల్స్ మీద దృష్టి సారించాను. దీంతో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు కష్టపడి చదివాను. ఆంథ్రోపాలజీ ఆప్షనల్ స్జబెక్ట్‌గా ఎంచుకున్నాను. ఇందుకు హైదరాబాద్‌లోనే కోచింగ్ తీసుకుని పకడ్బందీగా చదివాను. అయితే ఈ ఫలితాల్లో మూడో ర్యాంకు వస్తదని ఊహించలేదు అని
అనన్య రెడ్డి తెలిపారు. సామాజిక సేవ చేయాలనే తపన తనలో చిన్నపట్నుంచే ఉందన్నారు. ఈ క్రమంలోనే సివిల్స్‌పై దృష్టి సారించి సాధించాను. తమ కుటుంబంలో సివిల్స్ సాధించిన తొలి అమ్మాయిని తానేనని చెప్పారు. నాన్న సెల్ఫ్ ఎంప్లాయ్ కాగా అమ్మ గృహిణి అని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ తర్వాత సివిల్స్‌కు ఎంపిక అవుతానని భావించినప్పటికీ.. మూడో ర్యాంకు వస్తుందని మాత్రం అస్సలు అనుకోలేదని ఆమె చెప్పారు. సొంత ప్రణాళికతోనే రోజుకు 12 నుంచి 14 గంటల పాటు చదివినట్లు తెలిపారు. చిన్నప్పటినుంచే సమాజానికి సేవ చేయాలన్న కోరికతోనే సివిల్స్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు.



## సత్యమే రామాయణ విశిష్టత

**తిరుమల:** లోకంలో సత్యమే భగవత్ స్వరూపం. ఆ భగవంతుడే రామచంద్రుడి రూపంలో భూమ్మీద అవతరించాడు. ఆయన ఆచరణంతా సత్యమే. ఆయన ఆయుధమూ సత్యమే. అందుకే లక్షల ఏళ్లయినా రామాయణం చెక్కు చెదరలేదు.రామాయణ కథకు ఇంతటి ప్రాచుర్యం ఎందుకొచ్చిందంటే అది సత్యానికి ఉన్న ప్రాధాన్యం వల్లనే అని గుర్తించాలి. అది ఎలా సత్యమైంది అనంటే దానికి సాక్షి పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడే. రామాయణ అవతరణ విశేషాలను పరిశీలిస్తే ఈ విషయాలన్నీ అవగతమవుతాయి. సంపదలన్నీ సత్యం మీదనే ఆధారపడి ఉంటాయి. అన్నింటికీ సత్యమే ఆధారం. సత్యంకంటే శ్రేష్ఠమైనది సృష్టిలో ఇంకొకటి ఏదీ లేదు. వేదవేదాంగాలు, సకల శాస్త్రాలు సత్యం మీదనే ఆధారపడి ఉన్నాయి. లోకమంతా సత్యాన్ని ఆశ్రయించి ఉంటుంది. రుషులు, దేవతలు శ్రేష్ఠమైనది సత్యమేనని భావిస్తూ సత్యాన్ని అనుసరిస్తుంటారు. అందుకే లోకంలోని సత్యవాదులు మాత్రమే భగవంతుడి నిలయమైన పరంధామానికి చేరుతుంటారు. శ్రీరామచంద్రుడు రూపుదాల్చిన సత్యస్వరూపుడు అని రామాయణం ప్రతిపాదిస్తుంది. ఆ స్వామి తన తండ్రిని సత్యసంధుడిగా చేయటమే తన ముఖ్యకర్తవ్యమని రామాయణంలో వివరించి చెప్పాడు. సత్యలోకప్రభువు, స్వయంభువు అయిన బ్రహ్మదేవుడు స్వయంగా వాల్మీకి మహర్షికి సాక్షాత్కరించి రామాయణాన్ని రచించమని ప్రేరేపించాడు. అంతేకాదు శ్రీరామ చరిత విశేషాలన్నీ వాల్మీకి మహర్షికి సహజంగానే స్ఫురిస్తూ ఉంటాయని ఆ మహర్షికి వరాన్ని కూడా ఇచ్చాడు. ఆ వర ప్రభావంతో రామచరితమంతా స్పష్టంగా వాల్మీకి కళ్లముందు కనిపించింది. ఆ విశేషాలన్నిటినీ రామచందప్రభువు రాజ్యమేలే రోజుల్లోనే ఆ మహర్షి చక్కగా శ్లోకబద్ధం చేశాడు. అంతేకాదు ఆ శ్రీరామచంద్రుడి కుమారులైన కుశలవులిద్దరికీ ఆ శ్లోకాలన్నీ కంఠస్థం అయ్యేలా చెప్పాడు. దానితోపాటుగా ఆ సోదరుల చేతనే రాబోయే సంఘటనలతో సహా ఆ వృత్తాంతాన్నంతా పాడించాడు కూడా. కుశలవులు రామాయణాన్ని గానం చేసింది ఏ మారుమూల ప్రదేశంలోనో, రాముడి విషయాలు తెలియని ఏ ఒకరిద్దరి దగ్గరో కాదు సాక్షాత్తూ శ్రీరామచందప్రభువు నిండు కొలువు తీరి ఉన్నప్పుడే. దానంతటినీ రాముడు చక్కగా విన్నాడు. ఎవరైనా ఓ వ్యక్తి తనకు సంబంధించిన విషయాలను తన ఎదుట ఇతరులు వివరించి చెబుతున్నప్పుడు ఆ విషయాలు తనకు సంబంధించినవి కాకపోతే వాటిని ఖండిస్తాడు. కుశలవులు గానం చేసిన తన చరితం ఆసాంతం రాముడు విన్నాడు. వాటిలో ఏవైనా అసత్యాలు, కల్పనలు ఉంటే సత్యవాక్యపాలకుడైన రాముడు కచ్చితంగా ఆనాడు వాటిని ఖండించి ఉండేవాడు. రాముడే కాదు రాముడితోపాటు ఆ నిండుసభలో ఇంకా ఎందరెందరో ప్రముఖులు, రాముడి విషయాలన్నీ తెలిసినవారు కూడా ఉన్నారు. వారు కూడా కుశలవులు గానం చేసిన విషయాలలో దోషాలున్నాయని, అసత్యాలు ఉన్నాయని, కల్పనలు ఉన్నాయని అనలేదు. ఇదే రామాయణం సత్యమైనదని, అసలు సత్యమే రామాయణమని నమ్మేందుకు గీటురాయి. అలా సత్యవాక్య పాలకుడైన
రామచంద్రుడి ఆమోదముద్ర ఆ మహాకావ్యానికి లభించింది. రామాయణంలో కథానాయకుడు, సత్యస్వరూపుడు అయిన రామచంద్రుడి లీలావిశేషాలు తెలుసుకొన్నవారికి తమ జీవితాలలో సత్యాన్నే అనుసరించాలన్న సంకల్పం కనిపిస్తుంది. అందుకే రామాయణం నిత్యపారాయణ గ్రంథమైంది. రాముడు భగవంతుడి అవతారమే అయినా లోకానికంతటికీ ఆదర్శప్రాయుడైన ఒక మహాపురుషుడయ్యాడు.

# 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్

**అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ**

**ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 వరకు స్వీకరణ**

**క్రిమినల్ కేసులపై అభ్యర్థులు ప్రకటన చేయాలి**

**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం అంటే ఏప్రిల్ 18వ తేదీన విడులకానుందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ వెల్లడించారు. ఆ రోజే నుంచే ఎంపీ అభ్యర్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు.
మంగళవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.
నామినేషన్ వేసే అభ్యర్థులు తమపై ఉన్న క్రిమినల్ కేసులు బహిరంగంగానే ప్రకటన చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. పోటీ చేసే అభ్యర్థి ఖచ్చితంగా 25 ఏళ్లు నిండిన వారై ఉండాలన్నారు. అయితే నామినేషన్లు దాఖలుకు సమయం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు మాత్రమే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇక రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు అయిదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలపాలన్నారు. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో కేవలం 45 శాతం మేరే ఓటింగ్ జరిగిందని గుర్తు చేశారు. సారి ఆ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు హాజరుకాకుంటే ఎఫ్ఐఆర్ బుక్ చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులను ఆయన హెచ్చరించారు. ఎన్నికల శిక్షణ కోసం 23 వేల మందిని పిలిస్తే. వారిలో 3, 700 మంది శిక్షణకు హాజరుకాలేదన్నారు. మరోవైపు బోగస్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఆ క్రమంలో భారత ఎన్నికల సంఘానికి నివేదిక సైతం ఇప్పటికే పంపామన్నారు.
మరణించిన వారి పేర ఉన్న 30 వేల ఓట్లు, లక్ష షిఫ్టెడ్ ఓట్లతోపాటు 2 లక్షలకు పైగా ఉన్న నకిలీ ఓట్లను తొలగించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ వివరించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 45లక్షల 70 వేల ఓటర్లు ఉన్నారన్నారు. అలాగే జిల్లా పరిధిలో 1,675 ప్రాంతాల్లో 3,986 పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని లిక్కర్ ఔట్ లెట్స్‌లో సీసీ టీవీ కెమెరాలున్నట్లు వివరించారు. ఎన్నికల వేళ ఏమైనా ఫిర్యాదులు చేయాలంటే.. 1950 నెంబరికి కానీ లేకుంటే 1800 599 2999 నంబర్లకు కాల్ చేయవచ్చునని జిల్లా ప్రజలకు ఆయన సూచించారు. అలా కాకుంటే సి విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాధు చేయవచ్చునన్నారు.అయితే ఎన్నికల నగరా మోగిన నాటి నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో రూ. 16 కోట్లు సీజ్ చేయగా.. అందులో రూ.14 కోట్లు నగదు ఉందని చెప్పారు. అలాగే ఇప్పటి వరకు ఎంసీసీ కేసులు 3 నమోదు కాగా... 265 మందిని కోడ్ ఉల్లంఘన కింద అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు.

## లోక్ సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

**ఎన్నికల నిబంధనలపై సిబ్బందికి అవగాహన**

**విజిబుల్ పోలీసింగ్‌కు అత్యంత ప్రాధాన్యం**

**సమీక్షలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి**

హైదరాబాద్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లను, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం సమీక్షించారు. సైబరాబాద్ జోనల్ డీసీపీలు, అదనపు డీసీపీ లు, ఏసిపిలు, ఇతర అధికారులతో కలిసి సమీక్ష చేపట్టారు. సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికలను పకడ్బబ్బందీగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఎన్నికలలో ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలన్నారు. సైబరాబాద్ పరిధిలో అవసరమైన అన్ని చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం ముఖ్యంగా ఉచితాలను పట్టుకోవడానికి అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను తమ కిందిస్థాయి సిబ్బందికి అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనల మీద అవగాహనను కల్పించడానికి సిబ్బందితో సమావేశాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి ప్రతి అంశంపై అధికారులు, సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బబ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తుల మీద నిఘా వేసి ఉంచాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు పట్ల స్పష్టతతో ఉండాలన్నారు. చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని మరియు అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఇంతకు ముందు ఎలక్షన్స్ సమయంలో ఎదురైన సమస్యల పై పూర్తి నిఘా ఉంచాలని, రౌడీ షీటర్స్ ను, సస్పెక్ట్ షీట్ ఉన్నవారిని, హిస్టరీ షీట్ ఉన్నవారిని బైండోవర్ చేయాలన్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్ గా ఉండేలా చూడాలని, సమస్యాత్మక ప్రాంతాలను విధిగా పర్యటిస్తూ అట్టి ప్రాంతాలపై దృష్టిసారించాలని తెలిపారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డి. జోయల్ డేవిస్,మాదాపూర్ డీసీపీ డా. జి. వినీత్, మేడ్చల్ డీసీపీ నితికా పంత్, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, డీసీపీ ప్రసాద్, ఉమెన్ / చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం, సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి, ఎస్‌బి డీసీపీ సాయిశ్రీ, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ డివి శ్రీనివాసరావు, మేడ్చల్ ఎస్ఓటీ డీసీపీ డి. శ్రీనివాస్, ఏడీసీపీలు, ఏసీపీలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికులకు జీవిత బీమా..



హైదరాబాద్: గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నామని, దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గల్ఫ్ దేశాల్లో పనిచేసే కార్మికుల హక్కులు, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దీని కోసం జ్యోతిరావ్‌ఫులే ప్రజా భవన్‌లో సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఇక్కడ పాస్‌పోర్ట్ కౌంటరును, కార్మికుల తరఫున ఏ దేశంతోనైనా సంప్రదించే పకడ్బందీ వ్యవస్థను నెలకొల్పుతామన్నారు. హోటల్ తాజ్‌డెక్కన్‌లో గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికులకు పలు హామీలిచ్చారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానం రూపొందిస్తున్నామని, త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానించి, వారి సలహాలతో తుదిరూపు ఇస్తామని పేర్కొన్నారు. ఏజెంట్ల మోసాల కట్టడికి చర్యలు తీసుకుంటామని, వారికి చట్టబద్ధత ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు. గల్ఫ్ కార్మికులకు బీమాను కూడా అమలు చేస్తామని, కార్మికుడు మరణించిన సందర్భంలో.. అతడి కుటుంబానికి రూ.5 లక్షల బీమాను అందజేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సెప్టెంబరు 17లోగా గల్ఫ్ కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేయాల్సిన పనులు కొన్ని ఉంటాయి. కేంద్రంతో మాట్లాడేవాళ్లు ఉండాలి. పార్లమెంటులో మీ గొంతు వినిపించేందుకు నిజామాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ను, జీవన్‌రెడ్డి అన్నను గెలిపించండి. చెప్పిన అన్ని పనులు చేసి పెట్టే బాధ్యత నాది' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

### కేరళ, ఫిలిప్పీన్స్ విధానాల అధ్యయనం

'ఉత్తర తెలంగాణ నుంచి ఎక్కువమంది గల్ఫ్ కార్మికులు ఉన్నారు. ముఖ్యంగా జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్‌లో అత్యధికంగా ఉన్నారు. వీరి లావాదేవీలు నిర్వహించడానికి కొన్ని బ్యాంకులే ప్రత్యేకంగా ఏర్పడ్డాయంటే పరిస్థితి అర్థమవుతుంది. చాలా రోజుల నుంచి గల్ఫ్ కార్మికుల సమస్యల గురించి వింటున్నాం. ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే రాజకీయపార్టీలు స్పందిస్తాయనే అపోహ మీకుంది. కొన్నిసార్లు అది వాస్తవం కూడా. గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికుల విషయంలో కేరళ రాష్ట్రం, ఫిలిప్పీన్స్ దేశం అమలు చేస్తున్న విధానాలనూ అధ్యయనం చేశాం. కార్మికుల హక్కులు కాపాడేందుకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వమే ఇతర దేశాల వ్యవస్థలను సంప్రదిస్తుంది. ఉద్యోగం ఇచ్చిన సంస్థతో చర్చలు జరుపుతుంది. దీనివల్ల కార్మికుల మనోస్థైర్యం పెరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం తరఫున గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఒక టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేస్తాం. గల్ఫ్ వెళ్లే వారికి ఒక వారం రోజులు శిక్షణ అందించేలా చర్యలు చేపడతాం. వారు వెళ్తున్న దేశాలు, అక్కడి యాజమాన్యం, పరిస్థితులపై అవగాహన కల్పిస్తాం. ఏదైనా సమస్య వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలనే విషయాలను వివరిస్తాం. విదేశాలకు వెళ్లిన వారు తమ స్వస్థలంలో కొనుక్కున్న ఆస్తులకు రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాం. వారి తల్లిదండ్రులకు వైద్యం, ఇతరత్రా సాయం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది. చనిపోయిన కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ ప్రభుత్వం మీకు సాయం చేస్తుంది. అండగా ఉంటుంది. మీ సమస్యలను వినడానికి కూడా ఓపిక లేకపోతే.. మీ ఓట్లు అడగడానికి అర్హత లేదనేది నా అభిప్రాయం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

పార్లమెంటులో ప్రస్తావించే అవకాశమివ్వండి: జీవన్‌రెడ్డి

నిజామాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'స్థానికంగా ఉపాధి పొందలేని వారు గల్ఫ్‌లో ఉపాధిని వెతుక్కుంటూ వెళ్తున్నారు. భార్యాపిల్లలను, తల్లిదండ్రులను వదిలేసి దేశం కాని దేశానికి వెళ్తుండడం బాధాకరం. గత పదేళ్లలో గల్ఫ్ కార్మికులు చెమటోడ్చి స్వదేశానికి రూ.2 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చారు. కానీ గత భారాస ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మీ సమస్యలను పార్లమెంటులోనూ ప్రస్తావించేలా నాకు అవకాశం కల్పించండి' అని కోరారు.

### సమస్యలు విన్నవించిన కార్మికులు

ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు పలు సమస్యలను ప్రస్తావించారు. 'గల్ఫ్‌లోని జైళ్లలో మగ్గుతున్న కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం న్యాయవాదులను ఏర్పాటు చేసి విడిపించేందుకు కృషిచేయాలి. ఏజెంట్ల మోసాలను అరికట్టాలి. మన కార్మికులపై గల్ఫ్‌లో వివక్ష చూపుతున్నారు. అక్కడి ప్రభుత్వాలతో మాట్లాడి పరిష్కరించాలి. సౌదీ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇవ్వడం లేదు. అవి రాకుండానే కొందరు చనిపోయారు కూడా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలో విన్నవించాం. కానీ ఫలితం రాలేదు. ఆ బకాయిలు ఇప్పించాలి. మహిళా కార్మికులు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. దీనిపై దృష్టిపెట్టాలి' అని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టీపీసీసీ విదేశీ వ్యవహారాల అధ్యక్షుడు వినోద్, టీపీసీసీ ఎన్నారై సెల్ ఇంటర్నేషనల్ కన్వీనర్ మంద భీమ్‌రెడ్డి, గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు నరేశ్‌రెడ్డి, రవి గౌడ్, సీహెచ్ ప్రవీణ్, నరసింహ, మీర్ అయూబ్ అలీఖాన్, రాజు తదితరులు పాల్గొన్నారు. రూ.5 లక్షల బీమా ప్రకటించినందుకు ధన్యవాదాలు చెబుతూ కార్మిక సంఘాల ప్రతినిధులు సీఎంను సన్మానించారు.



# గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి.

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఏప్రిల్ 16:**

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా జూన్ 9 న నిర్వహించే గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించుటకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశమందిరంలో టీఎస్ పీఎస్ సి ద్వారా నిర్వహించే గ్రూప్-1 పరీక్షల నిర్వహణ సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు అన్ని ముందస్తు చర్యలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు కేటాయించే అభ్యర్థులకనుగుణంగా కామారెడ్డి పట్టణంలో 12 పరీక్షా కేంద్రాలను గుర్తించామని అన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించవలసిన గురుతర భాధ్యత చీఫ్ సూపరింటెండెంట్ లదే నని, యువేత భవిష్యత్తు మీ చేతులో ఉందని, ఎటువంటి చిన్న తప్పిదాలకు అవకాశమివ్వక లయజన్ అధికారులతో సమన్వయము చేసుకుంటూ ముందస్తుగా పరీక్షా కేంద్రాలను సందర్శించి అన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు.డిపార్ట్మెంటల్ అధికారులను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను,రూట్ అధికారులను, ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రాపరచాలని, జవాబుపత్రాలను జాగ్రత్తగా రవాణా చేయాలన్నారు. అభ్యర్థులను సునిశితంగా పరిశిలించి బయోమెట్రిక్ విధానం ద్వారా పరీక్ష హాలులోకి లోపలికి అనుమతించవలసి ఉంటుందని, ఎలక్ట్రానిక్ గాడ్జెస్, చరవాణి, అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రం సి.సి.కెమెరా నిఘాలో ఉండేలా చూడాలనున్నారు. గదులలో సరైన వెలుతురు ఉండేలా చూడాలని, ఎట్టి పరిస్థితులలో విద్యుత్ లో అంతరాయంలేకుండా చూడాలని, మంచి నీరు, ఓ.ఆర్.ఎస్. ఫ్యాకెట్లు, ప్రథమ చికిత్సకు ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, డీఈఓ రాజు, సహాయ పరీక్షల కమీషనర్ లింగం, జిల ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, తహసీల్దార్ జనార్దన్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖా నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

# 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ.

- రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు.
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్ వెల్లడి.
- రైస్ మిల్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన.
- మౌలిక సదుపాయాల పరిశీలన.
- రైతులకు ఫోన్లు చేసి బిల్లుల చెల్లింపులు జరిగాయా? అని నిర్ధారణ.
- కేంద్రాల నిర్వహణ బాగుందని కితాబు.
- సెంటర్ నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 16**

యాసంగి సీజన్ కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో ప్రభుత్వపరంగా నెలకొల్పిన కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ఇప్పటికే 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయడం జరిగిందని, ధాన్యం విక్రయించిన రైతులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. అంతకుముందు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం అయ్యారు. అనంతరం గుండారం గ్రామంలోని జై గణేష్ ప్యాడి ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్(రైస్ మిల్)ను సందర్శించి, ధాన్యం మర పడుతున్న తీరును, స్టాక్ నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం, చంద్రయాన్ పల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించి, మాయిశ్చర్ యంత్రం ద్వారా తానే స్వయంగా తేమ శాతాన్ని కొలిచారు. 17 శాతానికి లోబడి తేమ శాతం ఉండేలా చూసుకోవాలని, ఈ మేరకు ఎఫ్.ఏ.క్యూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తెచ్చేలా వారికి అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులకు సూచించారు. కేంద్రాలలో రికార్డులను పరిశీలించి, ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు అనే వివరాలను ఆరా తీశారు. ఈ కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులు పల్లా సందీప్, మల్లయ్య, చెవుల పెద్ద సాయిలును సెల్ ఫోన్ ద్వారా సంప్రదించి, బిల్లుల చెల్లింపులు జరిగాయా?...కొనుగోలు కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఎదురయ్యాయా?...సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది?... తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు తమ బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయని, కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, సకాలంలో ధాన్యం తూకం జరిగిందని రైతులు తెలుపగా, ప్రిన్సిపల్ కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అభినందిస్తూ, వారికి ప్రశంసాపత్రాలు అందజేయాలని తన కార్యాలయాల అధికారులను ఆదేశించారు. ఇదే తరహాలో కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని, రైతులకు అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచుతూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి తావులేకుండా వెంటదివెంట ట్యాబ్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.



## రికార్డు స్థాయిలో 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి

రాష్ట్రంలో ఈసారి యాసంగి సీజన్ లో ఇప్పటికే రికార్డు స్థాయిలో 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్రసింగ్ చౌహాన్ వెల్లడించారు. గతేడాది ఈ సమయానికి కేవలం 233 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగిందని, ఈసారి ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున రైతుల నుండి ధాన్యం సేకరించామని తెలిపారు. అవసరమైతే ఇంకనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, ఇతర మౌలిక సదుపాయాలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం నిల్వలు రాకుండా తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. కాగా, రబీ సీజన్ ధాన్యం సేకరణ కోసం జిల్లాలో 480 కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రిన్సిపల్ సెక్రెటరీ డీ.ఎస్.చౌహాన్ దృష్టికి తెచ్చారు. నిజానికి 466 కేంద్రాలను ఏర్పాటు చేసి, 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, రైతుల అవసరాలను గుర్తిస్తూ మొత్తం 480 కేంద్రాలను అందుబాటులో ఉంచామన్నారు. వీటిలో ఇప్పటికే 373 కేంద్రాలలో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని, లక్షా 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ. 98 కోట్ల బిల్లులను రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేదని, 90 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయని, కొత్త గన్నీ బ్యాగులు కూడా జిల్లాకు సరఫరా అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. సీ.ఎం.ఆర్ లక్ష్య సాధనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, డీ ఎస్ ఓ చంద్ర ప్రకాష్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ చౌహాన్ కు ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద జిల్లా అధికారులు పూల బొకేలు అందించి స్వాగతం పలికారు.

### మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

కాగా, రాష్ట్రంలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు, రైస్ మిల్లర్లు ఇబ్బందిపడకూడదనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని అన్నారు. జిల్లా పర్యటనకు హాజరైన ప్రిన్సిపల్ సెక్రెటరీ డీ.ఎస్.చౌహాన్, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ, బిల్లుల చెల్లింపులు, సీఎంఆర్ కేటాయింపులు తదితర వాటిపై ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఇదివరకటితో పోలిస్తే రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మిల్లింగ్ తదితర అంశాలలో ప్రస్తుతం పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చిందని, స్పష్టమైన ప్రగతి కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి కూడా ఆశించిన రీతిలో సహాయ, సహకారాలు లభిస్తున్నాయని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు. 2018 - 2019 సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న ట్రాన్స్ పోర్ట్ చార్జెస్ విషయమై భారత ఆహార సంస్థతో సమావేశం నిర్వహించి, సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులను ఒప్పించి రూ. 900 కోట్ల నిధులను మంజూరు చేయించామని గుర్తు చేశారు. దీనివల్ల మిల్లర్లకు ఎంతో లాభం జరిగిందని అన్నారు. ఇదే విధంగా గత చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్న హ్యాండ్లింగ్ చార్జెస్ బకాయిలను సైతం ఇప్పించేందుకు గట్టిగా కృషి చేస్తున్నామని, మరో నెల, రెండు నెలల వ్యవధిలో ఈ సమస్య కూడా పరిష్కారం అవుతుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు ఇతర సమస్యలను సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వారి పరిష్కారానికి చొరవ చూపుతామని అన్నారు. అయితే, సీ.ఎం.ఆర్ కేటాయింపులు లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో జరిగేలా ధాన్యం మిల్లింగ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. ముఖ్యంగా పారాబాయిల్డ్ బియ్యం నిల్వల అవసరం ఎక్కువగా ఉన్నందున ఏమాత్రం విరామం లేకుండా మిల్లింగ్ జరిపించాలని అన్నారు. తెలంగాణతో పాటు కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సైతం మన రాష్ట్రం నుండే బియ్యం ఎగుమతి జరుగుతున్నందున నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. మిల్లింగ్ విషయంలో నిజామాబాద్ జిల్లా రైస్ మిల్లర్లకు మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు.

VC NEWS వేగుచుక్క

బుధవారం 17 ఏప్రిల్ 2024







# కల్కి విడుదలలో మరింత ఆలస్యం?

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కల్కి 2898 ఏడీ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ముందుగా ప్రకటించిన ప్రకారం మే 9న విడుదల చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ మూవీ మరో తేదీన రాబోతుందంటూ వార్తలు ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా కల్కి 2898 ఏడీ రిలీజ్ డేట్‌పై కొత్త అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనుల ఆలస్య కారణంగా ఈ చిత్రాన్ని జులై 12న విడుదల చేయబోతున్నారంటూ వార్త వస్తోంది. మరి ఈ విడుదల తేదీపై మేకర్స్ నుంచి అధికారిక అప్‌డేట్ వస్తే క్లారిటీ వచ్చే అవకాశాలున్నాయి. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ నిర్మిస్తున్న కల్కి 2898 ఏడీలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టైటిల్, గ్లింప్స్ వీడియో, టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతున్నాయి. మేకర్స్ చాలా రోజుల క్రితం విడుదల చేసిన కల్కి 2898 ఏడీ రైడర్స్ కాస్ట్యూమ్స్ మేకింగ్, అసెంబ్లింగ్ వీడియో సినిమాపై అంచనాలు పెంచేస్తూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. నాగ్ అశ్విన్ టీం కొన్ని రోజుల క్రితం ఇటలీలోని సర్దినియా ఐలాండ్‌లో ప్రభాస్, దిశా పటానీపై వచ్చే పాటను చిత్రీకరించారని తెలిసిందే. లొకేషన్‌లో ప్రభాస్, దిశాపటానీ స్టైలిష్ లుక్‌లో ఉన్న స్టిల్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ సాంగ్ ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు నెట్టింట రిలీజ్ చేసిన క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.




# వేడుకగా శంకర్ కుమార్తె వివాహం

ప్రముఖ దర్శకుడు శంకర్ పెద్ద కుమార్తె ఐశ్వర్య వివాహం వేడుకగా జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కార్తీక్ తో సోమవారం ఉదయం ఆమె ఏడడుగులు వేశారు. చెన్నైలో ప్రముఖ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో ఇరు కుటుంబాలు, సినీ ప్రముఖులు సందడి చేశారు. కమల్‌హాసన్, రజనీకాంత్, నయనతార - విఘ్నేశ్ శివన్ దంపతులు, సూర్య, కార్తి, నరేశ్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. కొత్త జంటకు నెటిజన్లు అభినందనలు తెలుపుతున్నారు. వైద్యురాలైన ఐశ్వర్యకు ఇది రెండో వివాహం. 2021లో క్రికెటర్ రోహిత్‌తో ఆమె వివాహం జరిగింది. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. రోహిత్‌పై వచ్చిన పలు ఆరోపణల కారణంగానే ఆమె విడిపోయినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగింది. తరుణ్ కార్తీక్.. శంకర్ సినిమాలకూ సహాయ దర్శకుడిగా పని చేస్తున్నారు. శంకర్ ప్రస్తుతం రెండు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు.

కమల్ హాసన్ హీరోగా తెరకెక్కుతోన్న 'భారతీయుడు 2' జూన్‌లో విడుదల కానుంది. రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'గేమ్ ఛేంజర్' సెప్టెంబర్, అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.

# సీతా కళ్యాణ వైభోగమే' 26న విడుదల




సుమన్ తేజ్ , గరీమ చౌహాన్ హీరో హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 26న భారీ ఎత్తున విడుదల చేయనున్నారు. ఈ మేరకు చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. హీరో హీరోయిన్లు, దర్శక నిర్మాతలు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా మీడియాకు చిత్ర విశేషాలను తెలియజేశారు. ఈ సందర్భంగా హీరో సుమన్ తేజ్ మాట్లాడుతూ.. కొత్త హీరోని నమ్మి సినిమా తీయడం అంత ఈజీ కాదు. మా మీద నమ్మకంతో చిత్రాన్ని తీసిన నిర్మాత రాచాల యుగంధర్‌కి థాంక్స్. గరీమ చౌహాన్ చక్కగా నటించారు. మా దర్శకుడు సతీష్ గారు అన్ని అంశాలను కలగలపి మంచి కమర్షియల్ సినిమాను తీశారు. గగన్ విహారి చాలా వైల్డ్‌గా నటించారు. సంగీతం, కెమెరా వర్క్ అద్భుతంగా ఉంటుంది. మా ఫ్యాషన్ పార్ట్నర్స్ అయిన నీరుస్‌కు థాంక్స్. మా చిత్రాన్ని ఆడియెన్స్ ఆదరించాలని కోరారు. హీరోయిన్ గరీమ చౌహాన్ మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు ఇస్తున్న ప్రేమకు థాంక్స్. నాకు ఇదే మొదటి చిత్రం. ఇక్కడ అందరూ నన్ను ప్రోత్సహిస్తున్నారు. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. మహిళలకు తగిన ప్రాధాన్యం, గౌరవం ఇవ్వాలని చెప్పే సినిమా ఇది. మా మూవీని చూసి అందరూ ఆదరించండని అన్నారు. నటుడు గగన్ విహారి మాట్లాడుతూ.. ధర్మపురితో హీరోగా నాకు మంచి పేరు వచ్చింది. దర్శకుడు సతీష్ గారు సీతా కళ్యాణ వైభోగమే కథ చెప్పారు. టైటిల్ వింటేనే ఎంతో హాయిగా అనిపించింది. రాముడు, సీత అనే కాన్సెప్ట్‌తోనే ఈ చిత్రాన్ని తీశారు. ఇందులో నేను చాలా వైల్డ్‌గా కనిపిస్తాను. మా చిత్రాన్ని ప్రేక్షకులు చూసి సక్సెస్ చేయాలని అన్నారు.




# వారణాసిలో రణ్‌వీర్, కృతి సనన్



విలక్షణ నటనతో ఎంటర్‌టైన్ చేసే అతికొద్ది మంది బాలీవుడ్ యాక్టర్లలో ఒకడు రన్‌వీర్ సింగ్. అందం, అభినయం, స్టన్నింగ్ యాక్టింగ్‌తో ఇంప్రెస్ చేసే టాలెంట్ ఉన్న బ్యూటీ కృతిసనన్. ఈ భామ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేదు. ఈ ఇద్దరు యాక్టర్లు ఒక్కచోట సందడి చేస్తే ఎలా ఉంటుంది. రన్‌వీర్, కృతిసనన్ పాపులర్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా ఫ్యాషన్ షోలో థీమ్‌ను ప్రతిబింబించే కాస్ట్యూమ్స్‌లో ర్యాంప్ వాక్ చేసి ఔరా అనిపించారు. అనంతరం రన్‌వీర్‌సింగ్, కృతిసనన్ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని సందర్శించారు. రన్‌వీర్‌సింగ్, కృతిసనన్ వారణాసి సందర్శనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# 18న వస్తోన్న పొట్టేల్ సినిమా



మల్లేశం, వకీల్‌సాబ్, మ్యాస్ట్రో వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ హీరోయిన్ అనన్య నాగళ్ల తాజాగా తంత్ర సినిమాతో ప్రేక్షకులను అలరించిన విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ముందుకురాబోతుంది. ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్న తాజా చిత్రం 'పొట్టేల్' యువ చంద్ర కృష్ణ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాకు 'బంధం రేగడ్', 'సవారీ' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న సాహిత్ మోతుకురి దర్శకత్వం వహిస్తున్నాడు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా వస్తుండగా ఇప్పటికే సినిమా నుంచి విడుదల చేసిన గ్లింప్స్, పాటలు తెగ ఆకట్టుకున్నాయి.
ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి చిత్రయూనిట్ టీజర్ అప్‌డేట్ ఇచ్చింది.

# పరిణీతి ఈజ్ బ్యాక్..

అమర్‌సింగ్ చంకీలకు మంచి స్పందన

ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్ సింగ్ చంకీల 27 ఏళ్ల వయసులోనే హత్యకు గురైన సంగతి తెలిసిందే! ఆయన జీవితం ఆధారంగా 'అమర్‌సింగ్ చంకీల'చిత్రాన్ని తెరకెక్కించారు. ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహించారు. బాలీవుడ్ నటుడు దిల్జిత్ దొసాంజ్, పరిణీతి చోప్రాప్రధాన పాత్రధారులు. ఏప్రిల్ 12న నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన ఈ చిత్రం విశేష ఆదరణ పొందుతోంది. ఈ చిత్రంలో ఆమె పోషించిన అమర్‌జోత్ కౌర్ పాత్రకు వస్తున్న స్పందన గురించి పరిణీతి స్పందించారు. అమర్ సింగ్ చంకీల' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తోన్న స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది. ఆనందంతో కన్నీళ్లు ఆగడం లేదు. పరిణీతి ఈజ్ బ్యాక్.. అనే మాటలు చాలా గట్టిగా వినిపిస్తున్నాయి. ఇంత స్పందన నేను ఊహించలేదు. అవును.. నేను తిరిగొచ్చేశా. ఎక్కడికీ వెళ్లను. సినీ ప్రేమికులు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు మనసు నిండిపోయింది'

ప్రియాంక చోప్రా సోదరిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నటి పరిణీతి చోప్రా 2011లో విడుదలైన 'లేడీస్ వర్సెస్ రికీ బహ్ల్'లో కీలక పాత్ర పోషించారు. 'శుద్ధ్ దేశీ రొమాన్స్' , 'ఇషక్ జాదే', 'దావత్ ఏ ఇష్క్', 'కిల్ దిల్', 'డిష్యూం', 'గోల్‌మాల్ అగైన్', 'కేసరి', 'సైనా' వంటి చిత్రాల్లో ఆమె కథానాయికగా నటించి అలరించారు. ఆప్ యువ నాయకుడు రాఘవ్ చద్దాను గతేడాది ఆమె వివాహం చేసుకొన్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు స్వస్తి చెబుతారని అంతా భావించారు. కానీ తాజా పోస్ట్‌తో ఆ ఆ ఊహాగానాలకు చెక్ పెట్టారు.